క్లుప్తంగా

అందుబాటులో జీలుగ విత్తనాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 30 కేజీల బస్తా 65 శాతం సబ్సిడీ పోను రూ.849.70 చెల్లించాలన్నారు. కావాల్సిన రైతులు వ్యవసాయ కార్యాలయంలో ఆన్‌లైన్ నమోదు చేసిన ధ్రువీకరణ పత్రంతో విత్తనాలు పొందవచ్చన్నారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో మండలంలో ఏర్పాటు చేసిన 20 కేంద్రాల ద్వారా 1,329 మంది రైతుల ద్వారా 88 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించామని, సేకరించిన ధాన్యానికి సంబంధించి రూ.20 కోట్ల నగదును రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సేకరించిన ధాన్యానికి ఎలాంటి జాప్యం లేకుండా నగదును రైతుల ఖాతాల్లో జమచేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

గోపాల్‌పేట ఎస్‌ఐగా వెంకటేశ్వర్లు



గోపాల్‌పేట: స్థానిక ఎస్‌ఐగా బుధవారం వెంకటేశ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన జడ్చర్ల ఎస్‌ఐగా విధులు నిర్వహించి బదిలీపై గోపాల్‌పేటకు వచ్చారు. ఇంతకు ముందు గోపాల్‌పేట ఎస్‌ఐగా విధులు నిర్వహించిన మల్లేష్ ఎస్పీ ఆఫీస్‌కు బదిలీ అయి వీఆర్‌లో ఉన్నట్లు తెలిసింది. మండలంలో శాంతిభద్రత రక్షణకు నిరంతరం కృషి చేస్తామని, ప్రజలు సహకరించాలని ఎస్ వెంకటేశ్వర్లు కోరారు.

సాల్మన్‌రాజ్‌ను ఎమ్మెల్సీగా నామినేట్ చేయాలి

ఆత్మకూర్: క్రైస్తవ కమ్యూనిటీ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్, పాస్టర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోనె సాల్మన్‌రాజ్‌కు ఎమ్మెల్సీ పదవికి నామినేట్ చేయాలని పాస్టర్లు డిమాండ్ చేశారు. బుధవారం ఆత్మకూర్‌లోని బెత్లేహేం చర్చిలో జిల్లాలోని పాస్టర్లు సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని మతాలకు సమానహక్కును కల్పిస్తూ ముందుకెళ్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం నాయకులు రేవా సీపీ జర్మీయా, ఎస్ఎన్ రాజు, ఆర్నాల్డ్, ఎమేంజలిస్ట్, క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

వనపర్తి టౌన్: స్థానిక అంబేడ్కర్ చౌరస్తా నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్ అసిస్టెంట్ ఇంజినీర్ తులసి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని కొత్తకోట రోడ్డు, బసవన్న గడ్డ, రామ్‌నగర్ కాలనీ, ఆహా హోటల్, వల్లభ్‌నగర్, పాలిటెక్నిక్ రోడ్డు, ఆంధ్రాబ్యాంక్ ఏరియాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆత్మకూర్: జూరాల 220 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా గురువారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నామని ట్రాన్స్‌కో ఏఈ నర్సింహ తెలిపారు. అమరచింత, ఆత్మకూర్ మండలాల వినియోగదారులు సహకరించాలని కోరారు. అమరచింతలోని 33/11కేవీలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి మరమ్మతు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోండి

వనపర్తి టౌన్: టీఎస్ ఎస్సీ స్టడీ సర్కిల్ రెసిడెన్షియల్ పద్ధతిలో 5నెలల ఫౌండేషన్ కోర్సుతో పాటుగా బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్సీ పోటీ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్ టికెట్లు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి నుషిత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.tsstudycircle.co.in వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ఈనెల 21వ తేదీన మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు పరీక్ష నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 98859 29862, 89773 40006, 83096 57774 నంబర్లకు సంప్రదించాలన్నారు.

దేవరపల్లి వాసికి డాక్టరేట్

ఆత్మకూర్: మండలంలోని దేవరపల్లికి చెందిన మహేష్ వృక్షశాస్త్రంలో పీహెచ్‌డీ పట్టాను అందుకున్నాడు. పాపికొండ జాతీయవనం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వృక్ష సంపదపై చేసిన పరిశోధనలకు గాను ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బుధవారం డాక్టరేట్‌ను అందుకున్నారు. గ్రామం నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్న మహేష్‌కి కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కేశం నాగరాజుగౌడ్, యూత్‌కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తులసీరాజ్, మండల అధ్యక్షుడు పరమేష్, పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీను, రహ్మతుల్లా తదితరులు అభినందించారు.



కల్తీ విత్తనాలు అమ్మితే జైలుకే..



కొత్తకోటలో మన గ్రోమోర్ ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి, ఏఓ షేక్ మున్నా



పెబ్బేరులో..



మదనాపురంలో..

కొత్తకోట: ఫర్టిలైజర్ షాప్ నిర్వాహకులు రైతులకు కల్తీ ఎరువులు, విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని కొత్తకోట ఎస్‌ఐ మంజునాథ్‌రెడ్డి హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశానుసారం బుధవారం మండల వ్యవసాయ అధికారి షేక్ మున్నాతో కలిసి పట్టణంలోని మన గ్రోమోర్ షాపును ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపులో ఎరువులు, విత్తనాలను పరిశీలించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రశీదులను పొందాలని, గ్రామాల్లో ఎవరైనా అక్రమంగా ఎరువులు, విత్తనాలు ఇస్తామని చెబితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. రైతులు తప్పనిరిగా లైసెన్స్ ఉన్న షాపుల్లోనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని, సరైన లేబుల్ లేకుండా లూస్ అమ్మితే వాటిని కొనుగోలు చేయొద్దని సూచించారు.

మదనాపురం: మండలంలో ఎవరైనా రైతులకు కల్తీ విత్తనాలు విక్రయిస్తే ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ మురళి, వ్యవసాయ అధికారి షేక్ మున్నా హెచ్చరించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మదనాపురం మండల కేంద్రంలో టాస్క్‌ఫోర్స్ టీం సభ్యులు రాజా ఫర్టిలైజర్, లక్ష్మీవెంకటేశ్వర ఫర్టిలైజర్ షాప్‌లో విత్తనాలను తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించాలని యజమానులకు సూచించారు. నిబంధనలు పాటించకుండా కల్తీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే జైలు శిక్ష తప్పదని హెచ్చరించారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాలను బుధవారం ఏఓ చంద్రమౌళి, ఎస్‌ఐ జగదీష్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి ఎరువుల దుకాణదారులు లైసెన్స్ కలిగి ఉండాలని, రైతులకు విత్తనాలు అమ్మేటప్పుడు రశీదు తప్పనిసరి ఇవ్వడంతో పాటు లూజు విత్తనాలు, ప్యాకెట్లు, బస్తాలపై కాలం చెల్లిన తేదీలు, రికార్డులు, మొలకెత్తని నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం ధ్రువీకరించిన విత్తనాలనే రైతులకు విక్రయించాలని ఎస్‌ఐ శ్రీహరి, మండల వ్యవసాయ అధికారి మల్లయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మందులు, ఎరువుల దుకాణాలను వారు తనిఖీ చేశారు. ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లుగా తేలితే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

భక్తి పారవశ్యంలో ఈర్లదిన్నె



ఈర్లదిన్నెలో ధ్వజస్థంభ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

అమరచింత: మండలంలోని ఈర్లదిన్నెలో బుధవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలో ప్రజల ఆర్థిక సహకారాలతో నిర్మించబడిన దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠలు, శివాంజనేయ స్వామి ఆలయంలో లింగమయ్య, బొడ్రాయి, ధ్వజస్తంభ, గ్రామ దేవతలు, నవగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి.

పూజల్లో పాల్గొన్న నాగరాజ్‌గౌడ్

ఈర్లదిన్నెలోని శివాంజనేయ ఆలయంలో జరిగిన ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ హాజరై, గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు నాగరాజ్‌గౌడ్‌ను శాలువ, పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, పోసిరి గారి విష్ణు, రహ్మతుల్లా తదితరులు పాల్గొన్నారు.

డీఈని సస్పెండ్ చేయాలి



మాట్లాడుతున్న కౌన్సిలర్ విజయరాములు

అమరచింత: మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో జరుగుతున్న రూ.3.30 కోట్ల నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని సీపీఐ పట్టణ కార్యదర్శి భాస్కర్, మూడోవార్డు కౌన్సిలర్ విజయరాములు తెలిపారు. మూడో వార్డులో జరిగిన సీసీ రోడ్ల పనుల నాణ్యతపై బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం రోడ్ల పరిశీలనకు వచ్చిన డీఈ శ్రీనివాసులను కలిసి రోడ్ల నాణ్యత, మంజూరు లిస్టులో ఉన్న మిగిలిన పనులను యధావిధిగా పూర్తి చేయాలని కోరడం జరిగిందన్నారు. సరైన సమాధానం ఇవ్వని డీఈ శ్రీనివాస్ కాంట్రాక్టర్‌కు తొత్తుగా మారి అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. నాణ్యత లేని సీసీ పనుల గురించి వివరణ ఇవ్వాలని కోరడంతో కౌన్సిలర్ విజయరాములుపై డీఈ దురుసుగా ప్రవర్తించడం దూషించడం తగదన్నారు. కాంట్రాక్టర్‌కు వత్తాసు పలుకుతున్న డీఈపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. అవినీతి పనులకు ప్రోత్సహిస్తున్న డీఈని సస్పెండ్ చేసేవరకు సీపీఐ పోరాటం చేస్తుందన్నారు. శ్యాంసుందర్, రవీందర్, మసప్ప, కుతుబ్ పాల్గొన్నారు.

'ఆధార్' అప్‌డేట్‌ను సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: మండలంలో నిర్వహిస్తున్న ఆధార్ అప్‌డేట్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆర్ఐ మహేష్ అన్నారు. బుధవారం మండలంలోని శాగాపూర్, మల్లాయిపల్లి గ్రామాల్లోని జీపీ భవనాల్లో ఆధార్ అప్‌డేట్ కేంద్రాలను ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశానుసారం ప్రతి జీపీలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ప్రారంభిస్తున్నామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకొని ఆధార్ కార్డును అప్‌డేట్ చేసుకొని నూతన ఆధార్ కార్డును పొందాలన్నారు. ప్రతి జీపీలో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్న విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మౌనికయాదవ్, జయకళ, పంచాయతీ కార్యదర్శులు, ఆధార్ కేంద్రం నిర్వాహకులు తిరుపతయ్య, రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు తిరుపతియాదవ్, మల్లేష్‌యాదవ్, చంద్రయ్య, రామస్వామి పాల్గొన్నారు.



ఆధార్ అప్‌డేట్ పత్రాన్ని అందజేస్తున్న ఆర్ఐ మహేష్

ముగ్గురికి రిమాండ్

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని సాయిశ్రీ వైన్స్ వద్ద ఘర్షణ పడిన వ్యక్తులు మహేష్, యాదగిరి, శివలపై బుధవారం కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలో 10వ తేదీన కొల్లాపూర్ చౌరస్తాలో ఉన్న సాయిశ్రీ వైన్స్ షాపు వద్ద లిక్కర్ కొనుగోలు చేసే క్రమంలో వై.శాఖాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మయ్యకు మహేష్, యాదగిరి, శివల మధ్య గొడవ జరగడంతో పాటు లక్ష్మయ్యను తీవ్రంగా గాయపర్చారు. దీంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ అనంతరం ముగ్గురుని కోర్టుకు హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

ఆడిట్‌ను నిలిపివేయాలని వినతి

పాన్‌గల్: మండలంలోని వివిధ గ్రామ సంఘాల ఆడిట్‌ను నిలిపివేయాలని కోరుతూ మండల వీఓఏల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఏపీఎం సక్రూనాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడారు. ఐకేపీ వీఓఏలు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న విషయం విదితమే గ్రామ సంఘాలకు సంబంధించిన అన్ని రికార్డులు వీఓఏలతో ఉంటాయని, వారు సమ్మెలో ఉండటంతో రికార్డులను చూపించడం వీలుకానందున ఆడిట్ నిర్వహణను నిలిపివేయాలని కోరారు. వీఓఏలు సమ్మె విరమించిన తర్వాత ఆడిట్ నిర్వహించేలా తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ విషయాన్ని జిల్లా అధికారులకు తెలియపరుస్తానని వారి ఆదేశానుసారం తగు చర్యలు తీసుకుంటామని ఏపీఎం పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఓఏల సంఘం నాయకులు రాజయ్యగౌడ్, భాగ్యమ్మ, శేషయ్య నాయుడు, బాలరాజు, ధర్మయ్య, గంగాధర్, మమత, పద్మ, బాలరాజు, కృష్ణయ్య, వహీద్ తదితరులు పాల్గొన్నారు.



ఏపీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఐకేపీ వీఓఏలు

ఎల్‌ఓసీ అందజేత

ఖిల్లాఘనపురం: మండలంలోని ఉప్పరిపల్లికి చెందిన మేదరి మహేష్ ఇటీవల తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరాడు. ఆస్పత్రి ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. మంజూరయిన రూ.2.5 లక్షల ఎల్‌ఓసీని బుధవారం హైదరాబాద్ మంత్రుల నివాసంలో బాధితుడి కుటుంబ సభ్యులకు మంత్రి నిరంజన్‌రెడ్డి అందజేశారు.



'అసత్య ఆరోపణలు చేయడం జూపల్లికి తగదు'

చిన్నంబావి: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావుకు నీచపు రాజకీయాలు తగవని జెడ్పీటీసీ వెంకటరమణమ్మ అన్నారు. బుధవారం మండలంలోని జెడ్పీటీసీ స్వగృహంలో ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నీతి నిజాయితీతో కూడిన రాజకీయాలు చేస్తున్న తమ కుటుంబంపై భూకబ్జా ఆరోపణలు ఆయన అనుచరులతో చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వ సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీరం హర్షవర్ధన్‌రెడ్డి అడుగుజాడల్లో పనిచేస్తున్న తమపై జూపల్లి అనుచరులు నిందారోపణలు చేయడం తగదన్నారు. పెద్దదగడ శివారులో రైతు బజారయ్యతో మేము గూడెం గ్రామానికి చెందిన కొంత మంది రైతులతో కలిసి గతంలోనే పట్టా భూమి కొనుగోలు చేశామని ఆ తరువాత పాస్‌పుస్తకం కూడా వచ్చిందన్నారు. తర్వాతి రోజుల్లో జూపల్లికి వ్యతిరేకంగా రాజకీయాల్లో తాము చురుకుగా ఉండడంతో ఆయన కక్ష్యసాధింపుగా తమపాలంలో మత్స్యశాఖ భవనం అక్రమంగా కేటాయించారని గుర్తు చేశారు. దీనిని అప్పట్లోనే వ్యతిరేకించామని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న చిన్నారెడ్డి

ఆలయ భూమి స్వాహా

స్వయాన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావే రామలింగేశ్వర స్వామికి చెందిన ఆరు ఎకరాల ఆలయ భూమిని కబ్జా చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. జూపల్లి కబ్జా చేసిన భూమిని దేవాదాయ శాఖకు అప్పగిస్తున్నామని చెప్పి ఇప్పటి వరకు ఎందుకు అప్పగించలేదని దుయ్యబట్టారు. ఒక వేళ జూపల్లి కబ్జా చేసిన ఆరు ఎకరాల భూమిని దేవాదాయ శాఖకు అప్పగిస్తే తాము కూడా భూమిని ప్రభుత్వానికి అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా సవాలు విసిరారు. లేదంటే బహిరంగ క్షమాపణ చెప్పాలని, తనపై అసత్యారోపణలు చేసినందుకు కోర్టు ద్వారా సమాధానం చెబుతానన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదన్న యాదవ్, పెద్దమారు సర్పంచ్ గోవింద్ శ్రీధర్‌రెడ్డి, చిన్నారెడ్డి, తగరం కుర్మయ్య, డేగ శేఖర్ యాదవ్, నరసింహ, రామకృష్ణ, గూడెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెరుగుదలపై ప్రత్యేక దృష్టి

పాన్‌గల్: హరితహారంలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించి క్రమం తప్పకుండా నీరు పట్టాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని కేతేపల్లిలో రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలను ఆయన పరిశీలించారు. వేసవి కాలం దృష్ట్యా మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని, క్రమం తప్పకుండా నీరు పట్టాలని, ఎండిపోయిన మొక్కల స్థానంలో నూతన మొక్కలను నాటాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం గ్రామంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను ఆయన పరిశీలించారు. మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాల్లో స్థానిక సర్పంచ్‌లు పాల్గొనలేదు. కేవలం పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలోనే ఈ కార్యక్రమాలను నిర్వహించారు.



కేతేపల్లిలో రోడ్డు పక్క మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలోని లిటిల్ స్టార్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థుల్లో 10 జీపీఏ సాధించిన జతిన్, 9.8 జీపీఏ సాధించిన జీవన్‌ను బుధవారం ఎస్‌ఐ నాగన్న పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్ధేశించుకొని దానికి అనుగుణంగా చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవడంతో పాటు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ చదువుపైనే దృష్టి సారించి ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. ఏ స్థాయిలో ఉన్నా జన్మనిచ్చిన తల్లిదండ్రులను, గురువులను, సొంత గ్రామాన్ని మరిచిపోకూడదన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేసిన పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని ఆయన అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఆంజనేయులు, ఉపాధ్యాయ బృందం, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌ఐ నాగన్న

ముగిసిన సీఎం కప్ పోటీలు



ఖిల్లాఘనపురంలో విజేతలకు ప్రశంసా పత్రాలు అందించిన అధికారులు

అమరచింత: మండల స్థాయిలో మూడు రోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ క్రీడలు బుధవారం ముగిశాయి. మొదటి రోజు క్రీడాకారుల పరిచయ కార్యక్రమంతో ముగించిన అధికారులు రెండో రోజు కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. మూడోరోజు విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, జెడ్పీటీసీ మార్క సరోజ, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, కమిషనర్ మహమ్మద్ ఖాజా, ఎంపీడీఓ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ మైదానంలో ఈ నెల 15నుంచి నిర్వహించిన చీఫ్ మినిస్టర్ కప్ ఆటల పోటీలు బుధవారం ముగిసినట్లు ఫిజికల్ డైరెక్టర్ కుమార్ తెలిపారు. అథ్లెటిక్స్ 100మీటర్లు, 400మీటర్లు, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించగా వాలీబాల్ పోటీల్లో చిన్నమందడి మొదటి స్థానం, రెండో స్థానంలో పెద్దమందడి నిలిచాయి. ఖోఖో పోటీలో చీకురుచెట్టుతండా మొదటి స్థానంలో, బలిజపల్లి రెండో స్థానంలో, కబడ్డీలో జగత్‌పల్లి మొదటి స్థానంలో, అనకాపల్లితండా రెండో స్థానం సాధించాయి. రన్నింగ్ 100మీటర్లు ఎస్.నరేష్, 400మీటర్లు జె.నరేష్ విజేతలుగా నిలిచారు. గెలుపొందిన వారికి తహసీల్దార్ సంధ్య, ఎస్‌ఐ హరిప్రసాద్, ఎంపీడీఓ అఫ్జల్ బహుమతులను అందజేశారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో నిర్వహించిన సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీలు బుధవారంతో ముగిశాయి. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను ఎంపీపీ సంధ్య, జెడ్పీటీసీ భార్గవి అందించారు. ప్రస్తుతం మండల స్థాయిలో వివిధ కేటగిరీల్లో ప్రతిభ కనబర్చిన వారిని జిల్లాస్థాయిలో ఆడించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీను, వైస్ ఎంపీపీ శేఖర్, ఎంపీటీసీ కేతమ్మ, అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: స్థానిక జాతరమైదానంలోని మినిస్టేడియంలో నిర్వహించిన సీఎం కప్ పోటీలు ముగిశాయి. విజేతలకు ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, జెడ్పీటీసీ శివరంజని, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కమిషనర్ నాగరాజు, ఎంఈఓ భాస్కర్‌సింగ్, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు గాడికృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కోటేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్‌యాదవ్, విరేషలింగం తదితరులు పాల్గొన్నారు.



పెద్దమందడిలో..



గోపాల్‌పేటలో..

ఖిల్లాఘనపురం: మండల స్థాయి క్రీడల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయి చీఫ్ మినిస్టర్ కప్ 23 లో సత్తాచాటి మండలం పేరు నిలపాలని ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సామ్యానాయక్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పరమేశ్వర్, ఎస్‌ఐ శ్రీహరి, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి అన్నారు. సీఎం కప్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు వారు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, ఎంఈఓ ఉషారాణి, మండల టీఆర్ఎస్ అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, పీఈటీలు మన్యం, దేవేందర్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ శానిటేషన్‌పై అవగాహన

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని చెన్నారం రైతువేదికలో బుధవారం సర్పంచ్ రమేష్ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామ సభకు ముఖ్య అతిథిగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ రామేశ్వర్‌రెడ్డి హాజరై మాట్లాడారు. వారంపాటు గ్రామాల్లో ప్రత్యేక శానిటేషన్ పనులు కొనసాగించాలని సూచించారు. అనంతరం కేవీకే సైంటిస్ట్‌లు రైతులు వేసవి దుక్కులు ఎలా సిద్ధం చేసుకోవాలని అవగాహన కల్పించారు. అదేవిధంగా రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. పచ్చిరొట్ట సాగు చేసుకుని పంట దిగుబడి పెంచుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి బాల్‌రాజు, శాంతయ్య, నాగిరెడ్డి, రవీందర్‌రెడ్డి, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈఓ రామేశ్వర్‌రెడ్డి

గ్రామాల్లో ఇంకుడుగుంతలు తప్పనిసరి

• డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి

కొత్తకోట రూరల్: ప్రతి గ్రామంలో ఇంకుడు గుంతలు తప్పనిసరిగా నిర్మించుకోవాలని మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దమందడి మండలం జగత్‌పల్లిలో ఆయన పర్యటించి సర్పంచ్ అనంతమ్మతో కలిసి సామూహిక ఇంకుడుగుంత నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలోని డ్రైయినేజీ నీరు వృథా కాకుండా అయిదు ఇంకుడు గుంతలు నిర్మించేందుకు భూమిపూజ చేసినట్లు వివరించారు. అదేవిధంగా గ్రామస్తులు తమ ఇళ్ల ఎదుట ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్తులను భాగస్వాములను చేయాలని, ఎప్పటికప్పుడు డ్రైయినేజీలను శుభ్రం చేయించాలని, వేసవిలో తాగునీటికి ఇబ్బందులు కలగకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. అనంతరం మన ఊరు–మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అఫ్జల్, ఉప సర్పంచ్ లత, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కుమార్‌యాదవ్, ఎంపీటీసీ సభ్యుడు కుర్మయ్య, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



జగత్‌పల్లిలో ఇంకుడుగుంత నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీఎల్‌పీఓ రఘునాథ్‌రెడ్డి, సర్పంచ్ అనంతమ్మ